
ఇన్స్పెక్టర్ షాడో
MVS
PUBLICATIONS
మధుబాబు

# ఇన్‌స్పెక్టర్ షాడో

రచన

మధుబాబు

© Author
© Madhu  Baabu
This digital book is published by -

కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

All rights reserved.

No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.

# ఇన్‌స్పెక్టర్ షాడో

"గుడ్‌మార్నింగ్ ఇన్‌స్పెక్టర్ సాబ్!" అంటూ లోపలికి వచ్చి స్టిఫ్‌గా శాల్యూట్ చేశాడు హెడ్ కానిస్టేబుల్ షరాబ్‌సింగ్.

టేబిల్ మీద వున్న కాగితాల్ని శ్రద్ధగా పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ షాడో విసుగ్గా తల ఎత్తి చూశాడు.

గొంతు తడారిపోయినంత పని అయింది షరాబ్‌సింగ్‌కి.

"మాఫ్‌కర్నా ఇన్‌స్పెక్టర్ సాబ్.. మిమ్మల్ని డిస్టర్బ్ చేసినందుకు మన్నించండి" అంటూ ఖంగారుగా యింకో శెల్యూట్ కొట్టి బయటికి పరిగెత్తబోయాడు.

చిరునవ్వుతో చేయెత్తి అతన్ని మధ్యలోనే ఆపుచేశాడు షాడో.

"ఇట్సాల్‌రైట్ షరాబ్‌సింగ్.. డిస్టర్బెన్స్ ఏమీ కాలేదు కాని... నీ బాధ ఏమిటో చెప్పి వెళ్ళు..." సిగరెట్ వెలిగించుకుంటూ అన్నాడు.

అతను అంత భరోసా యిచ్చినప్పటికీ షరాబ్‌సింగ్ బెదురు తొలగిపోలేదు.

"మరేం లేదు ఇన్‌స్పెక్టర్ సాబ్.. మెహందీ బజార్ నుంచి మీరు చెప్పిన అమ్మాయిల్ని తీసుకువచ్చాం.. మరి.. మరి.." అంటూ గొణిగాడు అటూ యిటూ కదులుతూ..

"ఆల్‌రైట్! వాళ్ళను యిటు పంపించు" అంటూ కుర్చీలో నుంచి లేచి టేబిల్ అంచు మీద కూర్చున్నాడు షాడో.

పదిక్షణాల తరువాత అతనిముందు ప్రత్యక్షం అయినారు కనులు మిరుమిట్లు గొలిపే అందగత్తెలు అరడజనుమంది

దారినపోయే రుష్యశృంగుడినైనా సరే కవ్వించి కోరికలు రేకెత్తించగల నేర్పు వారికి వుంది. వారి వ్యాపారం కూడా అదే. సరదాపడి వచ్చినవారిని మురిపించి, ఆ తరువాత రౌడీల చేత తన్నించి జేబులు ఖాళీ చేయించటం వారి స్పెషాలిటీ.

"వ్యభిచరించటం అనేది పాపం అని కాని, నేరం అని కాని అనేందుకు, నీతులు వలించేందుకు నాకు అర్హత లేదు . రాని మీ జీవనం మీరు సాగించుకునే సమయంలో ఎదుటివారిని గురించి కూడా కొంచెం ఆలోచించమని మాత్రం నేను అంటాను. దారినపోయే వారందర్నీ వెకిలి చేష్టలతో ఆకర్షించటం న్యూసెన్స్ అనిపించుకుంటుంది. మీ దగ్గరికి వచ్చిన వారిని దోచుకోవటం నేరం అవుతుంది..." ఆ అమ్మాయిల మీద వినవస్తున్న రూమర్లను గుర్తు చేసుకుంటూ గంభీరంగా అన్నాడు షాడో.

కిసుక్కున నవ్వి ముఖాలు చాటు చేసుకున్నారు ముగ్గురు యువతులు. వయ్యారంగా నిలబడి తమ అందాలన్నీ స్పష్టంగా కనిపించేటట్లు వళ్లు విరుచుకున్నారు మిగిలినవారు.

"వారం రోజుల క్రితం మీకు ఒక వార్నింగ్ ఇచ్చాను. అయినా సరే మీ అలవాట్లను మీరు మార్చుకోవటం లేదు." వారి ప్రవర్తనను పట్టించుకోనట్లు నటిస్తూ మరోసారి అన్నాడు షాడో.

"ఓ యబ్బో! ఇటువంటి వార్నింగులు చాలా విన్నాం. ఇలా మాట్లాడిన ఇన్స్‌పెక్టర్లందరూ ఏమైపోయారో యీ పాటికి మీకు తెలిసే వుంటుంది..." చటుక్కున సమాధానం యిచ్చింది ఒక పడుచు.

నరాల్లోని రక్తమంతా ఒక్కసారిగా వేడెక్కినట్లు చివాలున కుర్చీలో నుంచి లేచాడు షాడో. కంటికి కనిపించనంత వేగంగా కదిలింది అతని ఎడమ చేయి. సమాధానం యిచ్చిన పడుచు చెంప ఖణేల్ మని మ్రోత చేసింది. బాధగా అరిచి చెంపను అదుముకుంటూ వెల్లకిలా నేల మీద పడిపోయిందామె.

"మానం అమ్ముకొని బ్రతుకుతున్నారన్న సానుభూతితో యీసారికి కూడా మిమ్మల్ని వదిలేస్తున్నాను. మీ బెదిరింపులకు భయపడి పారిపోయే పిరికితనం నాలో లేదు. ఈసారి మీ మీద ఏవిధమైన కంప్లయింట్ వచ్చినా మీ అందర్నీ కట్టకట్టి గంగాపూర్ సెంట్రల్ జైల్లో పేడతట్టలు మోసేందుకు పంపిస్తాను. ఖబడ్దార్. చలే జావ్ యహాఁసే..." ఖంగుమంటూన్న కంఠంతో ఆర్డర్ యిచ్చాడు షాడో.

తెల్లగా పాలిపోయిన ముఖాలతో అతని వంక భయం భయంగా చూస్తూ క్రిందపడిన తమ స్నేహితురాలి చేతులు పట్టుకొని లేవతీశారు ఆ పడుచులు.

గతంలో ఎంతోమంది ఇన్స్పెక్టర్లను చూసి వున్నారు వారందరూ. డబ్బుకు బానిసలై లొంగిపోయారు ఆ ఇన్స్పెక్టర్లలో కొందరు. తమ అందాలకు తల్లక్రిందులుగా పల్టీ కొట్టి మచ్చికయినారు మరికొందరు. బెదిరింపులకు భయపడి తమ దారికి అడ్డు తొలిగారు మిగిలినవారందరూ.

వారిలాంటివాడు కాదు కొత్తగా వచ్చిన యీ ఇన్స్పెక్టర్. ఇతని ముందు యింకోసారి నోరు తెరిస్తే తమ బ్రతుకులు తెల్లవారి పోవటం తప్పదనే అనిపిస్తోంది.

"వీడి బొంద.. వీడు ఎంత? వీడి బ్రతుకెంత? మన అల్లాబక్షీని పిలిచి ఒక్కసారి పుసికొల్పామంటే తెల్లారేసరికి వీడి శవం జామా నదిలో స్నానం చేస్తూ వుంటుంది. పదండి పోదాం.." చెంపను తడుముకుంటూ లోగొంతుకతో అని ముందు దారి తీసింది దెబ్బతిన్న యువతి.

ఆ మాటలు షాడోకి వినబడలేదు గాని, డ్యూటీ రిజిస్టర్‌ని పట్టుకొని శిలావిగ్రహంలా అక్కడే నిలబడివున్న షరాబ్‌సింగ్ చెవికి చేరాయి.

చలిగాలి వీచినట్లు జలదరించింది అతని శరీరం. రాంపూర్ సిటీలో వుండే రౌడీలందరిలోనూ రక్తం తాగే రాక్షసుడిగా పేరొందిన కసాయివాడు ఆ అల్లాబక్షీ. అతని మూలకంగా అనేకమంది ఇన్స్‌పెక్టర్లు అవమానాల పాలయినారు. అతని విషయంలో కొంచెం జాగ్రత్త గా వుండమని ఇన్‌స్పెక్టర్ సాబ్‌కి చెప్పటం మంచిదేనా అని అతను అనుకుంటుండగానే హటాత్తుగా అక్కడ ప్రత్యక్షం అయినాడు అల్లాబక్షీ.

వంటరిగా రాలేదతడు. అతని వెనకాలే వస్తున్నాడు సబ్ఇన్‌స్పెక్టర్ ముఖేష్. అతనికి నాలుగు అడుగుల దూరంలో వున్నాడు కొత్త గా చేరిన కుర్ర కానిస్టేబిల్ శ్రీకర్.

గుమ్మంలో ఎదురయిన పడుమల్ని చూసి ఆశ్చర్యంతో మ్రాన్పడిపోయాడు అల్లాబక్షీ. ఏదో అనటానికి నోరు తెరిచాడు కాని మాట బయటికి రాలేదు.

అతను నోరు తెరిచిన మరుక్షణం, "సువ్వర్ కే బచ్చే.. నిలబడి కబుర్లు చెపుకోటానికా నిన్ను తీసుకు వచ్చింది? నడువ్ బే సాలే..." అంటూ ఫెడీమని అతని మెడమీద చరిచాడు వెనుక వున్న ముఖేష.

గింగిరాలు తిరుగుతూ ఆడవాళ్ల మధ్యగా పోయి షాడో కూర్చుని వున్న టేబిల్ ముందు పడ్డాడు అల్లాబక్షీ.

అంతమంది ఆడవాళ్ల ముందు అలా దెబ్బ తినటం అతని రోషాన్ని ఒక్కసారిగా రెచ్చగొట్టింది.

"రేయ్ ఇన్స్పెక్టరూ.. నేనెవరని అనుకున్నావురా? నీ నెత్తురు త్రాగకపోతే నా పేరు అల్లాబక్షీ కానే కాదురా" అని తోకతొక్కిన తాచులా బుసలు కొడుతూ వేగంగా పైకి లేచి నడుముకున్న లెదర్ బెల్టును విసురుగా వూడదీశాడు.

కోపంతో ముఖం ఎర్రబడుతుండగా శ్రీకర్ చేతిలోని లాటీ కర్రని అందుకొని ముందుకు దూకబోయాడు ముఖేష్.

అతనికంటే వేగంగా కదిలాడు కుర్చీలో కూర్చొని వున్న షాడో.

"నువ్వు ఆగు ముఖేష్! మామూలు మాటలు యితనికి అర్థం కావు. మామూలు పద్ధతులు కూడా యితని ముందు ఎందుకూ పనికిరావు" అంటూ బూటు కాలును ఎత్తి లాగి పెట్టి తన్నాడు అల్లాబక్షీ పిర్రల మీద.

ఎదురుచూడని ఆ దెబ్బకు బిగ్గరగా అరిచి బోర్లా పడిపోయాడు అల్లాబక్షీ. వెంటనే రెండు అడుగులు ముందుకు వేసి అతని డొక్కల్లో తన్నాడు షాడో.

ప్రక్కటెముకలు పటపటలాడుతుండగా మరింత బాధగా అరిచి లేచి వెంటనే నిలబడే ప్రయత్నం చేశాడు అల్లాబక్షీ.

అతని ప్రయత్నం యిసుమంత కూడా ఫలించలేదు. దెబ్బ మీద దెబ్బగా కాళ్లను మార్చి మార్చి లాగి లాగి తన్నాడు షాడో. అతను గది దద్దరిల్లి పోయేటట్లు అరిచినా ఆగలేదు. అతని ముక్కులు వెంటా, నోటివెంటా రక్తపు చాటరలు వెలువడినా ఆగలేదు.

బాధను భరించలేక, మెలికలు తిరిగిపోతూ, రెండు చేతుల్నీ పైకి ఎత్తి బావురుమన్నాడు అల్లాబక్షీ..

ఎంతోమంది ఇన్స్పెక్టర్ల చేత ఎన్నో సార్లు దెబ్బలు తిని వున్నాడతను. అతని వంటిమీద పడిన ప్రతి దెబ్బా బాధకు బదులు రోషాన్ని, కక్షను రెచ్చగొట్టేది. పగ తీర్చుకోవాలనే పట్టుదలను పెంచేవి.

కాని యిప్పుడు పడుతున్న దెబ్బలు మాత్రం అలా కాదు. రోషాన్ని, కక్షని రెచ్చగొట్టటానికి బదులు బాధతో పెట్లిపోతున్నాయి అతని నరాలు. భరించలేని బాధ. అంతకు ముందెన్నడూ కనీవినీ ఎరుగని పిరికితనం అతన్ని ఆవరించుకుంటున్నాయి.

"చాలు ఇన్స్పెక్టర్ సాబ్.. యిక చాలు.. నాకు బుద్ధి వచ్చింది. ఇక ముందు ఎన్నడూ మీ ముందు దుడుకుతనంగా మాట్లాడను.." పైకి ఎత్తిన చేతుల్ని జోడించి నమస్కారం చేస్తూ బిగ్గరగా అరిచాడతను.

వెనక్కి లాగిన బూటు కాలును వెంటనే క్రిందకి దించి చేతిలోని సిగరెట్ని అవతలకి విసిరేసాడు షాడో.

"నడిబజార్లో నిలబడి మనల్ని వినరాని తిట్లు తిడుతున్నాడు.. మనందరినీ జామా నదిలో ముంచి లేపుతాట్ట" ముందుకు వస్తూ అతనితో అన్నాడు ముఖేష్.

లేచి కూచోబోతున్న అల్లాబక్షీ మళ్లీ దెబ్బల వర్షం ప్రారంభం అవుతుందన్న భయంతో, నెత్తికి చేతుల్ని అడ్డం పెట్టుకొని గబగబా జరిగాడు గోడ దగ్గరకు.

తమ కళ్లను తామే నమ్మలేక నోళ్ళు తెరుచుకొని రాస్తున్నారు గుమ్మం ముందు ఆగిపోయిన పడుచులందరూ. తను చూస్తున్నది కలో నిజమో అర్థంకాని పరిస్థితిలో చిక్కుబడి తల బరుక్కున్నాడు హెడ్ కానిస్టేబుల్ షరాబ్సింగ్.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=484**